క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మిర్యాలగూడ అర్బన్ : పట్టణంలోని వై జంక్షన్ వద్ద గల సబ్‌స్టేషన్ రామచంద్రగూడం 11కేవీ లైన్ ఫీడర్ మరమ్మతుల కారణంగా ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ట్రాన్స్ కో అధికారులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రామచంద్రగూడంలో కొంత భాగం బంగారుగడ్డ ప్రాంలో కొంత భాగం, నల్లగొండ రోడ్డులో కొంత భాగం ఉదయం 7:30 గంటల నుంచి 10:30 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు

పెద్దవూరలో..

పెద్దవూర : మండలంలోని పెద్దవూర సబ్ స్టేషన్ పరిధిలో ఆదివారం ఉదయం 8 గంటల నుంచి 11గంటల వరకు విద్యుత్ సరఫరాను బంద్ చేయనున్నట్లు ట్రాన్స్‌కో ఏఏఈ బి.దాసయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ తీగల కింద ఉన్న చెట్ల కొమ్మలను తొలగించేందుకు గాను 11కేవీ బట్టుగూడెం, 11కేవీ తుంగతుర్తి ఫీడర్‌ల కింద ఉన్న బట్టుగూడెం, తెప్పలమడుగు, లింగంపల్లి, తుంగతుర్తి, చింతపల్లి, చింతపల్లితండా, రామన్నగూడెం గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు. విద్యుత్ గృహ, వాణిజ్య వినియోగదారులు, రైతులు విద్యుత్ సిబ్బందికి సహకరించాలని కోరారు.

పాలిసెట్ దరఖాస్తుకు 22 చివరి తేది

నాగార్జునసాగర్ : పాలిసెట్-2024 కు దరఖాస్తు చేసుకోవటానికి ఈ నెల 22వ తేదీ చివరి తేదీ అని స్థానిక పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఏ.అయిలయ్య శనివారం తెలిపారు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.250లు, బీసీ, ఓసీ విద్యార్థులకు రూ.500లు పరీక్ష రుసుము ఉంటుందని తెలిపారు. పదో తరగతి పూర్తయిన విద్యార్థులు అర్హులని తెలిపారు. ఈ అవకాశాన్ని పదో తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

రేషన్ డీలర్‌పై కేసు నమోదు

పెద్దవూర : మండలంలోని ఉట్లపల్లి రేషన్ డీలర్‌పై కేసు నమోదు చేసినట్లు సివిల్ సప్లయ్ డీటీ ముఖ్తార్ తెలిపారు. శనివారం ఉట్లపల్లి రేషన్ దుకాణాన్ని తనిఖీ చేయగా ప్రజా పంపిణీ బియ్యం స్థానిక నిల్వలో 2.83 క్వింటాళ్లు తక్కువగా ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపారు. నిత్యావసర సరుకుల చట్టం ప్రకారం రేషన్ డీలర్‌పై 6ఏ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. రేషన్ దుకాణాల డీలర్లు నిర్లక్ష్యం వహించినా, కార్డుదారుల నుంచి బియ్యం కొనుగోలు చేసి పక్కదారి పట్టించినా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఆయన వెంట పెద్దవూర ఆర్ఐ దండ శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

వైభవంగా రథోత్సవం

గుర్రంపోడు : శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా శనివారం మండలంలోని కొప్పోలు గ్రామంలో రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. స్వామి వార్లను ప్రత్యేకంగా అలంకరించిన రథంపై గ్రామ వీధుల గుండా ఊరేగించారు. భక్తులు ఇళ్ల ముంగిట కొబ్బరికాయలు కొట్టి పూజలు చేశారు. మహిళల కోలాటాలు, మంగళవాయిద్యాలతో, యువకుల నృత్యాలు, భజనలు నీరాజనాల మధ్య అట్టహాసంగా రథోత్సవాన్ని నిర్వహించారు. యువకులు పోటీపడి రథాన్ని లాగారు. ఎండ వేడిమిని దృష్టిలో ఉంచుకుని ఉదయం ఆరుగంటల నుంచి మధ్యాహ్నం వరకు రథోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వద్దిరెడ్డిగూడెంలో గాలివాన బీభత్సం



రేకులు లేచిపోయిన ఇల్లు

గుర్రంపోడు : మండలంలోని వద్దిరెడ్డిగూడెం గ్రామంలో శుక్రవారం రాత్రి గాలివాన బీభత్సం చేసింది. గ్రామానికి చెందిన ఆవుల యాదయ్య, రేపాక కృష్ణయ్య, హనుమాన్ నాయక్‌లకు చెందిన ఇళ్ల రేకులు లేచిపోయి విరిగిపోయాయి. ఈ మేరకు బాధితులు తమకు నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

పోలీసుల చెంతకు గుర్తుతెలియని వృద్ధురాలు

మాడుగులపల్లి : మతిస్థిమితం కోల్పోయి ఇంటి నుంచి తప్పిపోయిన గుర్తు తెలియని వృద్ధురాలును శనివారం పోలీసులు చేరదీసి ఆశ్రయం కల్పించారు. మండల కేంద్రంలోని ఓ వీధిలో గుర్తు తెలియని వృద్ధురాలు సంచరిస్తుండగా స్థానికులు చేరదీసి భోజనం పెట్టారు. మాట్లాడించే ప్రయత్నం చేయగా తన పేరు గోరంట్ల పుల్లమ్మ అని వెంకటాద్రిపాలెం గ్రామమని తెలిపింది. అనంతరం వారు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వృద్ధురాలి వద్దకు వెళ్లి వివరాలు సేకరించారు. ఆమె చెప్పిన వివరాల ప్రకారం కుటుంబ సభ్యుల వివరాలు తెలుసుకునేందుకు యత్నిస్తున్నారు. స్టేషన్ స్వీపర్ ఇంట్లో వృద్ధురాలికి తాత్కాలికంగా ఆశ్రయం కల్పించినట్లు ఏఎస్ఐ జాఫర్ తెలిపారు.

పల్లెల్లో అందని పశువైద్యం

- పశువైద్యశాలల్లో డాక్టర్ పోస్టులు ఖాళీ
- పలు గ్రామాల్లో మూతపడిన ఆస్పత్రులు
- గోపాలమిత్రలతో వైద్య సేవలు



పిట్టలగూడెంలో వైద్యుడు లేక మూతబడ్డ పశువైద్యశాల



చేపూరులో మూతబడ్డ పశువైద్యశాల

గుర్రంపోడు : మండలంలోని పుశువైద్యశాలల్లో వైద్యుల కొరతతో మూతపడ్డాయి. దీంతో వైద్య సేవలు సరిగా అందడం లేదు. మండల కేంద్రం మినహా పక్కా భవనాలతో ఉన్న జూనూతుల, పిట్టలగూడెం, చేపూరు గ్రామాల్లోని పశువైద్యశాలలు మూతబడగా కొప్పోలులోని పశువైద్యశాలలో ఉన్న ఒక్క అటెండర్ అనారోగ్యం బారిన పడటంతో అక్కడా సేవలు అంతంత మాత్రంగానే అందుతున్నాయి. మండలకేంద్రంలో పశువైద్యాధికారితోపాటు ఒక్క సహాయకుడు మాత్రమే ఉన్నారు. ఇక్కడ వెటర్నరీ అసిస్టెంట్, అటెండర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. పిట్టలగూడెం, చేపూరు, జూనూతుల గ్రామాల్లోని పశువైద్యులు లేక ఏళ్లతరబడి మూతబడి ఉండటంతో వైద్యశాలలు శిథిలమవుతున్నాయి. ఈ గ్రామాల్లో గత పదేళ్లుగా పశువైద్యశాలలు మూతబడ్డాయి. జూనూతుల గ్రామంలో పశువైద్యశాలలో పశువైద్యాధికారి పోస్టు ఉన్నా గత 12 ఏళ్లుగా నియామకం జరగలేదు.

మండల కేంద్రానికే సేవలు పరిమితం

మండల పశువైద్యశాలలో పశువైద్యాధికారి, పశువైద్య సహాయకుడు ఉండటంతో సేవలు మండల కేంద్రానికి మాత్రమే పరిమితమయ్యాయి. అత్యవసర పరిస్థితుల్లో గ్రామాలకు పశువైద్యాధికారి వెళ్లాల్సి వచ్చినప్పుడు వైద్యం కోసం గ్రామాల నుంచి మూగజీవాలను తీసుకుని వచ్చిన రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండల పశువైద్యాధికారికి సహాయంగా వెటర్నరీ అసిస్టెంట్ లేక సేవలు అందక ప్రైవేట్ మెడికల్ షాపులను ఆశ్రయించి వారు ఇచ్చిన మందులను తీసుకుని వెళ్తున్నారు. బీమా క్లెయిమ్‌లకు విచారణకు, గొర్రెల పంపిణీ లబ్ధిదారుల ఎంపిక, శాఖాపరమైన పనులతో పశువైద్యాధికారి ఒక్కరే సేవలు అందించడంతో ఇబ్బందులు తప్పడం లేదు.

ఆస్పత్రి నిర్మాణానికి స్థలం కొరత

మండలకేంద్రంలో పశువైద్యశాల భవనం శిథిలావస్థలో ఇరుకుగా ఉండటంతో గత కొన్నేళ్ల క్రితం రూ.25 లక్షల నిధులు మంజూరయ్యాయి. స్థలం కొరతతో నిధులు వెనక్కి వెళ్లగా మళ్లీ స్థలం సమకూర్చి ప్రతిపాదనలు పంపితే నిధులు మంజూరయ్యే అవకాశం ఉన్నా పట్టించుకునే వారు కరువయ్యారు. ఇప్పటికైన ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి పశువైద్యశాలలను తెరిపించి పశువైద్య సేవలు అందేలా చూడాలని ఆయా గ్రామాల పాడిరైతులు, గ్రామస్తులు కోరుతున్నారు.

పశువైద్యశాలలను తెరిపించాలి



దశాబ్దకాలంగా పశువైద్యశాల మూతబడటంతో వైద్యసేవలు అందడం లేదు. అనారోగ్యం బారిన పడిన మూగజీవాలను ఐదు కిలోమీటర్ల దూరం ఉన్న మండల కేంద్రానికి తీసుకొని వెళ్లలేక మెడికల్ షాపులను ఆశ్రయిస్తున్నాం. పలు రకాల వ్యాధులతో మూగజీవాలు బలవుతున్నాయి.

– గోపిడి ముత్యంరెడ్డి, రైతు, పిట్టలగూడెం

ఉన్నతాధికారులకు నివేదించాం



మండలంలో పశువైద్యశాలల్లో సిబ్బంది లేక మూతబడి ఉన్న విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదించాం. గోపాలమిత్ర సేలను వినియోగించుకుని వైద్య సేవలు అందిస్తున్నాం. పశువైద్య సిబ్బంది నియామకం జరుగగానే పశువైద్యశాలలను అందుబాటులోకి తెస్తాం.

– కె. అశోక్‌కుమార్, మండల పశువైద్యాధికారి

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టాలి

- జెడ్పీ సీఈఓ ప్రేమ్‌కరణ్‌రెడ్డి



మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ ప్రేమ్‌కరణ్‌రెడ్డి

మిర్యాలగూడ : వేసవికాలంలో గ్రామాల్లో ప్రజలకు తాగునీటి ఎద్దడి లేకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని జెడ్పీ సీఈఓ ప్రేమ్‌కరణ్‌రెడ్డి అన్నారు. శనివారం మిర్యాలగూడ రైతు వేదికలో ఆయా శాఖల అధికారులతో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో చెడిపోయిన బోర్లకు, చేతి పంపులకు మరమ్మతులు చేపట్టడంతోపాటు గేట్ వాల్స్ ఏర్పాటు చేసుకోని నీటి వృథాను అరికట్టాలన్నారు. అవసరమైన చోట రైతుల నుంచి అద్దె బోర్లతో తాగునీటి సమస్యను పరిష్కరించాలన్నారు. గ్రామీణాభివృద్ధి కార్యక్రమాలను సంబంధిత అధికారులు సమన్వయంతో చేపట్టి అనుకున్న లక్ష్యం మేరకు పూర్తి చేయాలన్నారు. గ్రామాల్లో వ్యవసాయ పనులు లేనందున జాబ్‌కార్డు కలిగిన ప్రతి ఒక్కరికి పనులు కల్పించాలన్నారు. ఎండ తీవ్రత దృష్ట్యా కూలీలకు పని ప్రదేశంలో మంచినీటి వసతి, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, చలువ పందిళ్లు వేయాలన్నారు. నిర్ణీత సమయంలో పనులు చేసి నిర్దిష్ట కొలతలతో గరిష్ట వేతనం పొందేలా చూడాలన్నారు. ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను సంబంధిత అధికారులు తరుచు సందర్శించి కొనుగోలు సవ్యంగా జరిగేలా చూడాలన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా పాఠశాల ఏకరూప దుస్తులను కుట్టించి పాఠశాల పునఃప్రారంభం నాటికి అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డీపీఓ మురళి, జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ అదనపు సహాయ సంచాలకులు నవీన్‌కుమార్, ఎంపీడీఓ శేషగిరిశర్మ, ఏఈలు, ఎంపీఓ పద్మ, ఏపీఓ కళావతి, ఏపీఎంలు శేషయ్య, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు

హాలియా : పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమీపంలో నూతనంగా నిర్మించిన శ్రీ స్వయంభూ గంగమ్మతల్లి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవ పూజలను ఘనంగా నిర్వహించారు. శనివారం ఆలయంలో ప్రతిష్ఠాపనచార్యులు రాయప్రోలు మురళి గురుస్వామి, శ్రీరామశర్మ, ప్రతాపురం వెంకటాచార్యులు, జలాధివాసం. ధాన్యాధివాసం. పుష్పాధివాసం, క్షీరాధివాసం తదితర పూజలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు గొనీ రాజా రమేష్ యాదవ్, కాశయ్య, బూడిద గోవింద్, గంధం రామయ్య , శ్రీనివాస్, మల్లికార్జున్, రాజశేఖర్, బాలకృష్ణ, కొండల్, ఉన్నారు.



జలాధివాసం కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

మృతుడి కుటుంబానికి జెడ్పీ సీఈఓ పరామర్శ



కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న జెడ్పీసీఈఓ

మిర్యాలగూడ అర్బన్ : దామరచర్ల మండలం తిమ్మాపురం యూపీఎస్ పాఠశాలలో గణితం ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న నకిరేకంటి సైదులు పాఠశాలలకు వెళ్తున్న క్రమంలో బొత్తలపాలెం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న జెడ్పీసీఈఓ ప్రేమ్ కరణ్ రెడ్డి మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రిలో ఉన్న సైదులు మృతదేహాన్ని సందర్శించారు. కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేసి ఓదార్చారు. ఆయన వెంట ఎంఈఓ బాలాజీ నాయక్, దిలావర్‌పూర్ కాంప్లెక్స్ హెచ్‌ఎం సైదానాయక్, పీఆర్‌టీయూ జిల్లా నాయకులు కోటయ్య, దామరచర్ల పీఆర్‌టీయూ నాయకులు అశోక్ ఉన్నారు.

అవగాహనతో అగ్నిప్రమాదాల నివారణ



హాలియా : అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్న అధికారి జానయ్య

హాలియా : అవగాహన పెంచుకోవడం ద్వారా అగ్నిప్రమాదాలు నివారించొచ్చని అగ్నిమాపకశాఖ అధికారి జానయ్య తెలిపారు. అగ్నిమాపక వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో భాగంగా శనివారం హాలియా పట్టణంలోని టైం స్కూల్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. అగ్నిప్రమాదాలు సంభవిస్తే తీసుకోవాల్సిన జాగ్రత్తలను కరపత్రాలతో విద్యార్థులకు వివరించారు. అనంతరం 'అగ్ని ప్రమాదాలకు గల కారణలు వాటి నివారణ' అనే అంశంపై టైం స్కూల్ విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో విద్యార్థిని సీహెచ్ సుస్మిత మొదటి బహుమతి గెల్చుకోగా విద్యార్థి హరిరామ్ రెండో బహుమతి గెల్చుకున్నారు. ఈ కార్యక్రమంలో టైం స్కూల్ డైరెక్టర్ మందా నరేందర్‌రెడ్డి, ప్రిన్స్‌పాల్ కత్తి కోటిరెడ్డి, అగ్నిమాపక సిబ్బంది కోటేశ్వరరావు, శంకర్, నాగుల్ మీరా, ఎస్‌కె హుస్సేన్, కె రాము తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

దేవరకొండ : గ్యాస్ ప్రమాదాలపై మహిళలు అప్రమత్తంగా ఉండాలని దేవరకొండ అగ్నిమాపక అధికారి రాజునాయక్ అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా శనివారం దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేన్ భవనంలో ఆ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్‌వీటీ ఆధ్వర్యంలో మహిళలకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రత్యేకంగా ఇంట్లో గ్యాస్ సిలిండర్లు లీకై మంటలు చెలరేగినప్పుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో మాక్‌డ్రిల్ నిర్వహించి మహిళలకు అవగాహన కల్పించారు. అనంతరం కర్తవ్య నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన అగ్నిమాపక సిబ్బందికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు, శ్రీధర్‌గౌడ్, కృష్ణకిషోర్, నిరంజన్, తాళ్ల సురేష్, శ్రీను, జగన్, అగ్నిమాపక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ రోడ్ షోను జయప్రదం చేయాలి

మిర్యాలగూడ : పార్లమెంట్ ఎన్నికల్లో నల్లగొండ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి గెలుపునకు ఈనెల 24న పట్టణంలో మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ రోడ్‌షో నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు తెలిపారు. శుక్రవారం పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేసీఆర్ రోడ్ షోకు బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఆయా సంఘాల నాయకులు, అధిక సంఖ్యలో తరలి రావాలని కోరారు.

ఎంపీ అభ్యర్థి రోడ్‌షోను విజయవంతం చేయాలి

దేవరకొండ : ఈనెల 22న కొండమల్లేపల్లి, పీఏపల్లి మండలాల్లో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి రోడ్ షోను విజయవంతం చేయాలని దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్,పార్లమెంట్ ఎన్నికల ఇన్‌చార్జ్ మల్లికార్జున్‌రెడ్డి కోరారు. శనివారం స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఈ సమావేశంలో నాయకులు వల్లపురెడ్డి, ముత్యపురావు, శ్రీను, తులసిరాం, సుధాకర్, స్వామి, కిషన్, పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి రూ.6లక్షల చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

మిర్యాలగూడ అర్బన్ : త్రిపురారం మండలం చెన్నైపాలెం హైస్కూల్లో పని చేస్తున్న సామ సైదులు ఇటీవల గుండె పోటుకు గురై మరణించాడు. శనివారం మృతుడి కుటుంబానికి చేయూతగా టీఎస్ యూటీఎఫ్ సభ్యులు రూ.6లక్షల చెక్కును ఎమ్మెల్సీ నర్సిరెడ్డి చేతుల మీదుగా అందజేశారు. టీఎస్ యూటీఎఫ్ కార్యకర్తలకు ఫ్యామిలీ వెల్ఫేర్ (ఎఫ్‌డబ్ల్యూఎఫ్) ద్వార సభ్యులు ప్రమాదానికి గురై మరణిస్తే వారికి రూ.6 లక్షల రూపాయలు ఎఫ్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర కమిటీ అందజేస్తుంది. దీనిలో భాగంగా ఆకుటుంబానికి ఆర్థిక సహకారం అందించారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావ రవి, జిల్లా ప్రధాన కార్యదర్శి పెరుమళ్ల వెంకటేశం, ఎఫ్‌డబ్లుఫ రాష్ట్ర అధ్యక్షులు ఎం.రాజశేఖర్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి నాగమణి, డి.శ్రీనివాస్‌చారి, శ్రీనివాస్‌రెడ్డి, వెంకన్న, శ్రీనివాస్, వేదశ్రీ, సత్యనారయణ, శ్యామ్‌కుమార్, మధుసూదన్ పాల్గొన్నారు.

దేవరకొండకు చేరిన ఎన్నికల సామగ్రి



స్ట్రాంగ్ రూంకు సీల్ వేస్తున్న అధికారులు

దేవరకొండ : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో దేవరకొండ నియోజకవర్గానికి సంబంధించి అవసరమైన ఎన్నికల సామగ్రి శనివారం రాత్రి దేవరకొండకు చేరాయి. జిల్లా కేంద్రం నుండి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాహనంలో సాయుధ పోలీసుల బందోబస్తు నడుమ ఎన్నికల సామగ్రిని దేవరకొండ ఆర్డీవో శ్రీరాములు పర్యవేక్షణలో వివిధ రాజకీయ పార్టీల సమక్షంలో స్థానికంగా ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూంలో భద్రపరిచారు. ఈ కార్యక్రమంలో దేవరకొండ డీఎస్పీ గిరిబాబు, తహసీల్దార్ సంతోష్‌కిరణ్, సీఐ సురేష్, ఎస్ఐలు అజ్మీరా రమేష్, ఎలక్షన్ డీటీ ముబీన్, నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులు సృజనాత్మకతకు పదునుపెట్టాలి



సదస్సులో మాట్లాడుతున్న దుర్గాప్రసాద్

దేవరకొండ : విద్యార్థులు తమలో ఉన్న సృజనాత్మకతకు పదునుపెట్టాలని నాగార్జున ప్రభుత్వ డిగ్రీ కళాశాల నల్లగొండ అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.దుర్గాప్రసాద్ అన్నారు.శనివారం దేవరకొండ పట్టణంలోని ఎంకేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన 'యాక్సెస్ టు ఎలక్ట్రానిక్ ఇన్ఫర్మేషన్ రిసోర్స్ ఫర్ హయ్యర్ ఎడ్యుకేషన్' అనే అంశంపై నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు ఎలక్ట్రానిక్ ఇన్ఫర్మేషన్, ఉన్నత విద్యపై దృష్టి సారించాలని ఆయన సూచించారు. ఎప్పటికప్పుడు సాంకేతికతను అందిపుచ్చుకోవాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డా.రమావత్ రవి, అధ్యాపక బృందం రామరాజు, కోటయ్య, లింగారెడ్డి, లింగయ్య, శ్రీను, వెంకటేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

టీఎన్‌జీఓ ఉపాధ్యక్షుడు మౌలానా మృతి



మిర్యాలగూడ : మిర్యాలగూడ టీఎన్‌జీవో యూనిట్ ఉపాధ్యక్షుడు మౌలానా(48) శనివారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతిచెందారు. ప్రస్తుతం ఆయన మిర్యాలగూడ నీటి పారుదల శాఖ డివిజన్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నారు. టీఎన్‌జీఓ ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో క్రియాశీలకంగా పనిచేశారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఆయన మృతదేహాన్ని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, ఈఈ లక్ష్మణ్, ఏఈ అహ్మదుల్లా, టీఎన్‌జీఓ నాయకులు లక్ష్మణ్, చంద్రారెడ్డి, ఎండీ.ముబీన్, సైదులు, గంగపుత్ర, జానిపాషా, నుస్రత్‌అలీ, ఆంజనేయులు, సూపరింటెండెంట్ వెంకట్రామయ్య, అజీముద్దీన్, కౌన్సిలర్ ఇంతియాజ్‌లు నివాళులర్పించారు.

ఆర్థిక సాయం అందజేత

దేవరకొండ : పట్టణానికి చెందిన వరికుప్పల శ్రీధర్ కులవృత్తి చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. నెల రోజుల క్రితం పట్టణంలోని ఎల్‌ఐసీ కార్యాలయం వద్ద శ్రీధర్‌కు యాక్సిడెంట్ కావడంతో కాలు, చేతికి గాయాలు అయ్యాయి. వైద్యం కోసం దాదాపు రూ.4లక్షల వరకు ఖర్చయింది. ఈ విషయం తెలుసుకున్న హెల్పింగ్ హ్యాండ్స్ అసోసియషన్ సభ్యులు శనివారం శ్రీధర్‌కి రూ.15వేలు ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో అన్వేష్‌రెడ్డి, కేస నరేష్, సాయిచంద్ర, అంజి, మణిదీప్, శివ, తదితరులున్నారు.

బాధిత కుటుంబానికి..

చందంపేట : మండలంలోని ముదుదండ్ల గ్రామానికి చెందిన నకిరేకంటి బక్కయ్య అనారోగ్యంతో బాధపడుతున్నట్లు తెలుసుకుని గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు యాసాని రాజవర్ధన్‌రెడ్డి శనివారం రూ.10వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీను, గోపాల్‌రెడ్డి, నిరంజన్, ధర్మారెడ్డి, యాదయ్య, అనిల్, పాల్గొన్నారు.

ఆర్టీఐఏను పకడ్బందీగా అమలు చేయాలి

మాడుగులపల్లి : సమాచార హక్కు చట్టం (ఆర్టీఐఏ)ను పకడ్బందీగా అమలు చేయాలని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్ రామ్ అన్నారు. మండల కేంద్రంలో ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడు రామలింగారెడ్డితో కలిసి శనివారం విలేకరులతో ఆయన మాట్లాడారు. ప్రజలు కోరిన సమాచారాన్ని 30 రోజుల్లో అందించాల్సిన బాధ్యత ఆయా ప్రభుత్వ శాఖల్లోని సమాచార అధికారులపై ఉందన్నారు. లేనిపక్షంలో అప్పీల్ చేసుకునే అవకాశం ఉందని గుర్తు చేశారు. కొన్ని ప్రభుత్వ శాఖల్లో నిర్దిష్ట సమయంలో సమాచారం ఇవ్వడం లేదని ఆరోపించారు. పీఐఓలకు సమాచార హక్కు చట్టంపై సమగ్ర అవగాహన కల్పించాలని కోరారు. అనంతరం గ్రామసభల నిర్వహణ విధివిధానాలపై చర్చించారు. కార్యక్రమంలో మేడి రాజశేఖర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, నరహరి, దుర్గయ్య పాల్గొన్నారు.

బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపునకు కృషిచేయాలి



సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్సీ కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే భగత్, నాయకులు

పెద్దవూర: బీఆర్ఎస్ పార్టీ బలపర్చిన నల్లగొండ పార్లమెంట్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి గెలుపు కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే నోముల భగత్‌లు అన్నారు. శనివారం సాయంత్రం మండల కేంద్రంలో నిర్వహించిన బీఆర్ఎస్ ముఖ్య నాయకుల సన్నాహక సమావేశంలో పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ మాయమాటలతో ప్రజలను ప్రలోభాలకు గురిచేసి అధికారంలోకి వచ్చిందని తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త ఒక సైనికుడిలా కృషి చేయాలని అన్నారు. ఈ నెల 22వ తేదీ సాయంత్రం మండల కేంద్రంలో ఎంపీ అభ్యర్థి తరుపున ప్రచారం ప్రారంభమవతుందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జటావత్ రవినాయక్, నాయకులు చెన్ను సుందర్ రెడ్డి, నడ్డి లింగయ్య, పొదిళ్ల శ్రీనివాస్, రమావత్ శ్రీకర్‌నాయక్, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

విస్తృతంగా తనిఖీలు



చింతపల్లి : మాల్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న సీఐ నవీన్‌కుమార్

చింతపల్లి : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మండల పరిధిలోని మాల్ వీటినగర్‌లో హైదరాబాద్-సాగర్ ప్రధాన రహదారిపై పోలీసులు వాహన తనిఖీలను ముమ్మరం చేశారు. హైదరాబాద్ నుంచి మల్లేపల్లి వెళ్లే వాహనాలతో పాటు మల్లేపల్లి నుంచి హైదరాబాద్ వైపునకు వెళ్లే వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. ఎన్నికల నేపథ్యంలో మద్యం, డబ్బులు, అక్రమంగా రవాణ చేయకుండా నిఘా పెట్టినట్లు నాంపల్లి సీఐ నవీన్‌కుమార్ తెలిపారు. రూ.50వేలకు మించి తరలిస్తే సీజ్ చేస్తామన్నారు. ఆయన వెంట ఎస్ఐ యాదయ్య ఉన్నారు.

ప్రతి ఒక్కరూ భక్తిభావం పెంచుకోవాలి



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ : ప్రతి ఒక్కరూ భక్తి భావాన్ని పెంపొందించుకోవాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని బంగారుగడ్డ 33వ వార్డులో శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా చండీయాగం నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. పట్టణంలోని పలు వార్డుల నుంచి ప్రజలు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు నూకల వేణుగోపాల్ రెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి చిలుకూరి బాలు, కౌన్సిలర్ రామకృష్ణ, శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

సైదిరెడ్డిని గెలిపించాలని వినూత్న ప్రచారం



బీజేపీ ఎంపీ అభ్యర్థి సైదిరెడ్డికి ఓటు వేయాలని మహిళలను అభ్యర్థిస్తున్న కౌన్సిలర్ రమాదేవి

మిర్యాలగూడ టౌన్ : నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి గెలిపించాలని కోరుతూ శనివారం పట్టనంలో బీజేపీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చిలుకూరి రమాదేవి వినూత్న ప్రచారం చేపట్టింది. శనివారం పట్టణంలో శుభకార్యాలు జరిగే ఇళ్లలోకి వెళ్లి అక్కడ ఉన్నవారిని కమళం పువ్వు గుర్తుపై ఓటు వేయాలని అభ్యర్థించింది. అలాగే వార్డులోని ప్రతీ ఇంటికి వెళ్లి కేంద్రంలో నరేంద్రమోదీ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను వివరించి ఓటు అభ్యర్థించింది. అనంతరం మహిళలకు కమలం పువ్వు బ్యాడ్జీలను అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శి చిలుకూరి శ్యాం, నాయకులు కర్నాటి వెంకటేశ్వర్లు, జాహ్నవి, రాధిక, పద్మావతి, శ్రీనివాస్, సత్యనారాయణ తదితరులున్నారు.

ఆత్మరక్షణకు కరాటే దోహదం



బెల్టులు ప్రదానం చేస్తున్న ఎస్ఐ రామ్మూర్తి

కొండమల్లేపల్లి : విద్యార్థులు ఆత్మరక్షణకు కరాటే నేర్చుకోవాలని కొండమల్లేపల్లి ఎస్ఐ రామ్మూర్తి అన్నారు. కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని శివజ్యోతి నగర్ కాలనీ కరాటే పోటీలలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ఎస్ఐ రామ్మూర్తి బెల్టులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ విద్యార్థులు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో జపాన్ కరాటే అసోసియేషన్ చీఫ్ సుదర్శన్, పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ తప్పదు



సోమనారాయణను సన్మానిస్తున్న ఫణికుమార్

పెద్దవూర : ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి విరమణ అనేది తప్పదని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డీవీఎస్ ఫణికుమార్, నారాయణరెడ్డిలు అన్నారు. మండలంలోని పర్వేదుల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేసిన విసోమనరాయణ ఉద్యోగ విరమణ మహోత్సవంలో వారు పాల్గొని మాట్లాడారు. అనంతరం ఆయనకు పూలమాల , శాలువాలతో ఘనంగా సత్కరించి మెమెంటోలను అందించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ బాలునాయక్, పీఆర్‌టీయూ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దండ వీరారెడ్డి, ఎన్.దుర్గాప్రసాద్, నాయకులు కె.శ్రీనివాస్, బాణావత్ సక్రునాయక్, మేదరి దేవేందర్, మహేష్ పాల్గొన్నారు.

చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపాలి

మాడుగులపల్లి : తల్లిదండ్రులు తమ చిన్నారులను ప్రతిరోజూ అంగన్‌వాడీ కేంద్రాలకు పంపాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రజినీ కోరారు. మండలంలోని కల్వలపాలెం, చర్లగూడెం అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం ఈసీసీఈ (ఎర్లీ చెల్డ్‌హుడ్ కేర్ అండ్ ఎడ్యుకేషన్) దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు పౌష్టికాహారంతోపాటు ఆటపాటలతో కూడిన విద్య అందుతుందని తెలిపారు. అనంతరం చిన్నారుల అసెస్‌మెంట్ కార్డులు తల్లిదండ్రులకు అందించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు కల్పన, మౌనిక, ఆయాలు, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.